## హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో భారీ వర్షం

తెలంగాణ : హైదరాబాద్ నగరంలో గురువారం సాయంత్రం నుంచి భారీ వర్షం కురుస్తోంది. నల్లగండ్ల, మియాపూర్, గచ్చిబౌలి, కొండాపూర్, హైటెక్ సిటీ, జూబ్లీహిల్స్, మణికొండ, సరూర్‌నగర్, నాగోల్ తదితర ప్రాంతాల్లో వర్షం జోరుగా పడుతోంది. దీంతో పలు ప్రాంతాల్లో రోడ్లపై నీరు నిలిచే అవకాశం ఉండటంతో వాహనదారులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. మరోవైపు నగరంలోని దక్షిణ, మధ్య హైదరాబాద్ ప్రాంతాల్లో కూడా త్వరలో వర్షాలు ప్రారంభమయ్యే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు తెలిపారు. అలాగే నల్గొండ, సూర్యాపేట జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో కూడా వర్షాలు నమోదవుతున్నాయి.

## నూతన ఆర్వో ప్లాంట్‌ను ప్రారంభించిన జిల్లా కలెక్టర్ రాజర్షిషా



జూన్ 19, 2026_ఆదిలాబాద్: ప్రతి ఒక్కరికీ స్వచ్ఛమైన తాగునీరు అందించడమే ప్రభుత్వ ముఖ్య ఉద్దేశమని జిల్లా కలెక్టర్ రాజర్షిషా స్పష్టం చేశారు. శుక్రవారం బజారత్నూర్ మండలం గులాబ్ తండాలో 'బాల వికాస ఫౌండేషన్' ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్‌ను ఆయన రిబ్బన్ కట్ చేసి ఘనంగా ప్రారంభించారు. అనంతరం ప్లాంట్ పనితీరును, నీటి శుద్ధి ప్రక్రియను స్వయంగా పరిశీలించిన కలెక్టర్, స్థానిక ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటి సేవలను అందుబాటులోకి తీసుకొచ్చారు.

## అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాల విద్యార్థులకు బెంచీల వితరణ: ప్రారంభించిన జిల్లా కలెక్టర్ రాజర్షి షా



జూన్ 19, 2026_ఆదిలాబాదు: శుక్రవారం పట్టణంలోని బాలాజీనగర్ లోని అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాల విద్యార్థులకు బాలవికాస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఉచితంగా అందజేసిన బెంచీల వితరణ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ రాజర్షిషా ముఖ్య అతిథిగా హాజరై తరగతి గదులను రిబ్బన్ కట్ చేసి అధికారికంగా ప్రారంభించారు.

పాఠశాలలోని సుమారు 120 మంది విద్యార్థులకు సరిపడా బెంచీలను స్టోన్ హై స్కూల్ మేనేజ్మెంట్ ఆర్థిక సహకారంతో (ఫండింగ్) బాలవికాస్ సంస్థ ఈ బడికి గిఫ్ట్‌గా అందజేసింది. పేద విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలనే ఉద్దేశంతోనే ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు.

ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి మాధవి, బాలవికాస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సి. లక్ష్మి రెడ్డి గారు, సంస్థ డైరెక్టర్ సైదిరెడ్డి, వివిధ సెక్టార్ అధికారులు, పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## ఓటర్ల జాబితా సవరణపై సీఈఓ వీడియో కాన్ఫరెన్స్: పాల్గొన్న కలెక్టర్ రాజర్షి షా




సార్ -2026 ఓటర్ల జాబితా సవరణ అత్యంత పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సి.సుదర్శన్ రెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం హైదరాబాద్ నుండి జిల్లా కలెక్టర్లు, ఎన్నికల అధికారులకు ' సార్ -2026' ఓటర్ల జాబితా సవరణపై ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి దిశ నిర్దేశం చేశారు.

ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టరేట్ విసి హాల్ నుండి కలెక్టర్ రాజర్షి షా పాల్గొని జిల్లా నివేదికను వివరిస్తూ, జిల్లాలో ఓటర్ల నమోదు, సవరణ ప్రక్రియకు సంబంధించి బీఎల్ ఓ, బీఎల్ ఏల శిక్షణ, కిట్ల పంపిణీ ఇప్పటికే పూర్తయిందని వివరించారు. ఎన్యుమరేషన్ ఫారాలను ఇప్పటికే అందించామని, ఈ నెల 23 నాటికి అవి అందుబాటులోకి వస్తాయని తెలిపారు. ఓటర్లలో అవగాహన కోసం జిల్లా, మండల కేంద్రాల్లో హోర్డింగుల ద్వారా విస్తృత ప్రచారం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. క్షేత్రస్థాయి పరిశీలన కోసం ఏఈఆర్ఓలు, ఈఆర్ఓలు, డిప్యూటీ డీఈఓలతో నిరంతరం తనిఖీలు నిర్వహిస్తున్నామని వెల్లడించారు. ఇంకా మ్యాపింగ్ కాని ఓటర్లను గుర్తించి, మార్పులు-చేర్పులు చేపట్టాలని బీఎల్ ఓలను ఆదేశించినట్లు చెప్పారు. ఫారాల సేకరణ, డిజిటలైజేషన్ ప్రక్రియను నిరంతరం పర్యవేక్షిస్తామని, ఈ ప్రక్రియలో సహాయం కోసం ఎలాంటి రాజకీయ అనుబంధం లేని స్థానిక వాలంటీర్లను మాత్రమే ఎంపిక చేశామని ఆయన స్పష్టం చేశారు.

ఈ వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్ ఆర్.ఎస్. చిత్రూ, ఆర్డీఓ జగదీశ్వర్ రావు, ఎన్నికల విభాగం పర్యవేక్షకురాలు నలంద ప్రియ, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# టెలిగ్రామ్‌కు చుక్కెదురు... తాత్కాలిక నిషేధాన్ని సమర్థించిన ఢిల్లీ హైకోర్టు

ప్రముఖ మెసేజింగ్ యాప్ 'టెలిగ్రామ్'కు ఢిల్లీ హైకోర్టులో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. నీట్-యూజీ (NEET-UG) పునఃపరీక్ష నేపథ్యంలో ఈ యాప్‌పై కేంద్ర ప్రభుత్వం విధించిన తాత్కాలిక నిషేధాన్ని కోర్టు సమర్థించింది. దేశ భద్రత, పరీక్షల సమగ్రతను కాపాడటానికి అత్యవసర పరిస్థితుల్లో ఐటీ చట్టంలోని సెక్షన్ 69A కింద ప్రభుత్వం తీసుకున్న ఈ రక్షణాత్మక చర్యలు పూర్తిగా నిబంధనలకు లోబడే ఉన్నాయని జస్టిస్ తేజస్ కరియా ధర్మాసనం స్పష్టం చేసింది.

### dark web గా మారిన టెలిగ్రామ్

కేంద్ర ప్రభుత్వం గురువారం కోర్టుకు సమర్పించిన అఫిడవిట్‌లో టెలిగ్రామ్ యాప్ ఒక 'కొత్త డార్క్ వెబ్'లా మారిందని ఆందోళన వ్యక్తం చేసింది. దీనిలోని ప్రత్యేక ప్రైవసీ ఫీచర్లు, ఐడెంటిటీని దాచుకునే సదుపాయాల వల్ల సైబర్ నేరగాళ్లు, పరీక్షల పేపర్ లీక్ చేసే ముఠాలు, ఉగ్రవాద శక్తులకు ఇది ఒక సురక్షితమైన వేదికగా మారిందని కేంద్రం పేర్కొంది. పరీక్షల ప్రశ్నపత్రాలను లీక్ చేసి అమ్ముకోవడమే కాకుండా, టెలిగ్రామ్‌లో ఉండే మెసేజ్ ఎడిటింగ్ ఫీచర్‌ను వాడుతూ పాత తారీఖులతో నకిలీ లీకేజీ ఆధారాలను సృష్టించి విద్యార్థులను మోసం చేస్తున్నారని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (NTA) కోర్టుకు తెలిపింది. ఈ నేపథ్యంలో నిర్దిష్ట ఛానళ్లను మాత్రమే తొలగించడం సరిపోదని, యాప్‌ను తాత్కాలికంగా నిలిపివేయడమే సరైన మార్గమని హైకోర్టు వ్యాఖ్యానించింది. కోర్టు తాజా తీర్పుతో జూన్ 21న జరిగే నీట్ రీ-ఎగ్జామ్ ముగిసేవరకు (జూన్ 22 వరకు) దేశంలో టెలిగ్రామ్ సేవలపై నిషేధం కొనసాగనుంది.

## చౌకగా వచ్చిందని కొన్నారంటే... ఆసుపత్రి పాలే.. హైదరాబాద్‌లో భారీ ఫుడ్ స్కామ్ బట్టబయలు!






H-FAST అధికారులు 825 కిలోల నకిలీ పనీర్‌ను స్వాధీనం చేసుకున్నారు. 45 ఫుడ్ ఔట్‌లెట్లు, 8 తయారీ యూనిట్లపై దాడులు నిర్వహించి ఈ మోసాన్ని వెలికితీశారు. కూరగాయల కొవ్వులు, నాణ్యతలేని పదార్థాలతో తయారు చేసిన "చీజ్ అనలాగ్" ఉత్పత్తులను అసలైన పనీర్‌గా విక్రయిస్తున్నట్లు గుర్తించారు. మనం బయట తింటున్న పనీర్ నిజంగా పనీర్‌నేనా? మీ కుటుంబ సభ్యులు, స్నేహితుల ఆరోగ్యం కోసం ఈ సమాచారాన్ని తప్పకుండా షేర్ చేయండి